# మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి





- కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పిలుపు
- కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన
- మంచిర్యాల, లక్షెట్టిపేటలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

రాబోయే మంచిర్యాల కార్పొరేషన్, లక్షెట్టిపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎల్ఐసి కాలనీ నివాసంలో బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ తో కలిసి ఆయన మున్సిపల్ ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు.

**ప్రజలు బీఆర్ఎస్ పక్షాన ఉన్నారు...**

ఇటీవల పార్టీ గుర్తు లేకుండా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ మద్దతుదారులకు బ్రహ్మరథం పట్టారని దివాకర్ రావు గుర్తు చేశారు. ప్రతి పక్షంలో ఉన్నప్పటికీ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించడం బీఆర్ఎస్ బలానికి నిదర్శనమని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో కారు గుర్తుపై జరిగే మున్సిపల్ ఎన్నికల్లోనూ తిరుగులేని ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. టికెట్ ఎవరికి ఇచ్చినా అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

**కాంగ్రెస్ మోసపూరిత హామీలను ఎండగట్టాలి...**

అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అమలు సాధ్యం కాని '420' హామీలతో ప్రజలను వంచించిందని దివాకర్ రావు విమర్శించారు. కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కారు గుర్తుకు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వైఫల్యాలను, హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రచారంలో నాయకులు చురుగ్గా పాల్గొని మంచిర్యాల, లక్షెట్టిపేట గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని కోరారు. ఈ సమావేశంలో లక్షెట్టిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి మెరుగు పవన్, మాజీ ఫ్లోర్ లీడర్ అంకం నరేష్, పోడేటి శ్రీనివాస్, మందపల్లి శ్రీనివాస్ మరియు పార్టీ సీనియర్ నాయకులు, టీబీజీకేఎస్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

- చదువుకున్న పాఠశాలకే ప్రధానోపాధ్యాయుడిగా బండి రమేష్
- శిష్యుడిని ఘనంగా సన్మానించిన గురువు యోగేశ్వర్
- ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయమని వెల్లడి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నూతన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు బండి రమేష్ కోరారు. 1992 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థి అయిన రమేష్, పదోన్నతిపై తాను చదువుకున్న పాఠశాలకే ప్రధానోపాధ్యాయునిగా రావడం విశేషం. ఈ సందర్భంగా ఆయనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు, రాష్ట్ర పర్యావరణ చట్టం అథారిటీ సభ్యుడు గుండేటి యోగేశ్వర్ పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి రమేష్‌ను ఘనంగా సన్మానించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత యోగేశ్వర్ తన శిష్యుడికి పచ్చని మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో చరిత్ర కలిగిన ఈ పాఠశాల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలని రమేష్ పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా విద్యాసంస్థను విజయవంతంగా నిర్వహిస్తానని, పాఠ శాల అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వెల్ల డించారు. చదువుకున్న పాఠశాలకే బాధ్యు నిగా రావడం గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల సమన్వయంతో పాఠశాల కీర్తిని మరింత పెంచుతానని, విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతానని వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యకు మొండిచేయి.. బడ్జెట్ పునఃసమీక్షించాలి

- విద్యారంగానికి తక్కువ కేటాయింపులపై నిరసన
- తెలంగాణపై వివక్ష చూపిస్తున్న కేంద్రం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

కేంద్ర బడ్జెట్ విద్యార్థుల భవిష్యత్తును విస్మరించి, కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా ఉందని టీజేఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సుమారు ₹53 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి 10 శాతం నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి బడ్జెట్‌లో స్పష్టత లేదని మండిపడ్డారు. రాష్ట్ర విభజన హామీలైన ఐఐటీ, ఐఐఎం, నవోదయ పాఠశాలల ఏర్పాటులో కేంద్రం వివక్ష చూపుతోందని ధ్వజమెత్తారు. యువత ఆకాంక్షలకు విరుద్ధంగా ఉన్న బడ్జెట్‌ను తక్షణమే పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.

# ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ప్రారంభం




**శెనార్తి మీడియా, బెల్లంపల్లి:**

జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకం కింద జిల్లాలోని ఎంపిక చేసిన మండలాల కృషి సఖీలకు బెల్లంపల్లి కేవీకేలో సోమవారం ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. వ్యవసాయ శాఖ, కేవీకే సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణలో మంచిర్యాల, కాసిపేట మినహా మిగతా మండలాల నుంచి క్లస్టర్‌కు ఇద్దరు చొప్పున మొత్తం 40 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ, ప్రతి మండలంలో ఒకటి లేదా రెండు గ్రామాలను ఎంపిక చేసి రెండేళ్లలో పూర్తిస్థాయి ప్రకృతి సేద్య గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. శిక్షణ పొందుతున్న కృషి సఖులు రైతులకు మార్గదర్శకులుగా నిలవాలని సూచిం చారు. జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. కేవీకే కోఆర్డినేటర్ ప్రసూన ప్రకృతి వ్యవసాయంలో సుస్థిరత సాధించడంలో కృషి సఖుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, అధికారులు, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

**శెనార్తి మీడియా, రామగుండం / మంచిర్యాల:**

రామగుండం కమిషనరేట్ పరిధిలో బహిరంగ మద్యపానం, అనుమతి లేని డీజేలు, డ్రోన్లపై నిషేధాన్ని మార్చి 1 వరకు పొడిగిస్తున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మంచి ర్యాల, పెద్దపల్లి జోన్లలో సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. మద్యం మత్తులో వీధుల్లో అసభ్యంగా ప్రవర్తించే వారిపై భారతీయ న్యాయ సంహిత ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధర్నాలు, సభలు, ర్యాలీలు నిర్వహించాలనుకునే వారు ఏసీపీల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. బలవంతంగా బంద్‌లు చేయించే వారిపై కేసులు నమోదు చేస్తామని, ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

# అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల పట్టణంలోని నాగదేవత కాలనీకి చెందిన మల్యాల చిరంజీవి (46) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంతకాలంగా ఉద్యోగం లేకపోవడం, స్నేహితుల వద్ద చేసిన సుమారు ఐదు లక్షల రూపాయల అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ప్రాణాలు విడిచాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

- నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్
- ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు.. ఏర్పాట్లపై అధికారులకు ఆదేశం
- పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నాణ్యతను కాపాడాలని సూచన





**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మంగళవారం బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి అభ్యర్థుల తుది జాబితా తయారీని పరిశీలించారు. బెల్లంపల్లిలోని 34 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయని, మొత్తం ప్రక్రియను సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా పారదర్శకంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల ఫిర్యాదుల కోసం జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (08736-250501) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

**అభివృద్ధి పనుల తనిఖీ..**

అనంతరం బెల్లంపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, అటుపై రామ్ నగర్ మండల పరిషత్ పాఠశాల, కేజీబీవీ భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**భోజనం నాణ్యతపై ప్రత్యేక నిఘా...**

కాసిపేట మండలంలోని కేజీబీవీ, రేగులగూడ గిరిజన ఆశ్రమ పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి, విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సకాలంలో అందించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి




**శెనార్తి మీడియా, బోథ్:**

విద్యార్థులు తమకు వచ్చిన అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ సూచించారు. మంగళవారం సోనాల మండల కేంద్రంలో కచ్చకాయల హరీష్ యువ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి చదువు ప్రాముఖ్యతపై పలు సూచనలు సలహాలు అందించారు. కెరీర్ కౌన్సిలర్‌గా హాజరైన చెట్లపల్లి సంతోష్ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం ప్రాధాన్యతను వివరించారు. పదవ తరగతి అనంతరం ఎంచుకోవాల్సిన కోర్సులు, అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. కార్యక్రమ నిర్వాహకుడు కచ్చకాయల హరీష్ మాట్లాడు తూ విద్యార్థులకు ఉపయోగపడే ఇ లాంటి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవా ఏఓ, కోస్మెట్ శుద్ధోధన్, మునిగెల యోగిత, సుభాష్ సూర్య, బోరె రవి, ఉపాధ్యాయులు, గ్రామ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్క కు సన్మానం చేసిన ఆడే గజేందర్

**శెనార్తి మీడియా,బోథ్**



మేడారం జాతరను విజయవంతంగా నిర్వహించి, ఆదివాసీల ఖ్యాతిని ఖండాలు దాటించిన ఆదివాసీ ముద్దు బిడ్డ, తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు దానసరి అనసూయ (సీతక్క) ను బోథ్ నియోజవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆడే గజేందర్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మేడారం జాతర ప్రారంభం నుండి సీతక్క అక్కడే ఉంది స్వయంగా పనులు పర్యవేక్షించి జాతర విజయవంతం చేసింది అని అలాగే ఆసియా ఖండం లోనే పెద్ద పండుగ కి విదేశాల నుండి కూడా వచ్చేలా చేసే ఘనత సీతక్క ది అని తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం లో ఆలయాలు మరియు జాతర లు అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుంది అని తెలిపారు

# అడవి పందిని వేటాడిన ఇద్దరి అరెస్ట్



- 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు
- నిందితుల నుంచి మాంసం, విద్యుత్ తీగలు స్వాధీనం

**శెనార్తి మీడియా, మంచిర్యాల (లక్షెట్టిపేట):** అడవి పందిని వేటాడి, మాంసాన్ని వండుకుని తింటున్న ఇద్దరు వ్యక్తులను అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. కర్నపేట గ్రామానికి చెందిన మారినేని భూమయ్య, గునిగంటి లక్ష్మణ్ పెల్లిమడుగు శివారులోని వరి పొలాల్లో విద్యు త్ తీగలు అమర్చి అడవి పందిని వేటాడారు. నమ్మదగిన సమాచారం మేరకు నిందితుల ఇళ్లపై దాడులు చేసిన అధికారులు, వారి వద్ద నుంచి పంది మాంసం, వేటకు ఉపయోగించిన విద్యుత్ తీగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయస్థానం వారికి 14 రోజుల జుడీషియల్ రిమాండ్ విధించింది. అనంతరం వారిని లక్షెట్టిపేట జైలుకు తరలించారు

# రక్తదానం చేసిన మెడికల్ కళాశాల విద్యార్థులు



- మెడికల్ కాలేజీ విద్యార్థుల చొరవతో 10 యూనిట్ల రక్త సేకరణ
- బ్లడ్ బ్యాంక్‌లో నిల్వలు నిండుకోవడంతో ఆందోళన
- రక్తదాతలు ముందుకు రావాలని రెడ్ క్రాస్ పిలుపు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో రక్త నిల్వలు అట్టడుగు స్థాయికి పడిపోవడంతో మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎంబీబీఎస్ విద్యార్థులు స్పందించారు. రక్త కొరత కారణంగా తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, డయాలసిస్ రోగులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న విద్యార్థులు మణికంఠ, బలరామ్, శశాంక్, అభిషేక్, ఫాతిమా ఫేబి సహా 10 మంది మంగళవారం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్ మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను ఆదుకోవడానికి విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం రక్తనిధి కేంద్రంలో రక్తం అందుబాటులో లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆపద కాలంలో స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు స్పందించి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రాణాలు కాపాడేందుకు రక్తదాతలు పెద్ద ఎత్తున ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

## పట్టుదలతో చదివి జిల్లాకు గుర్తింపు తేవాలి




**శెనార్తి మీడియా, మంచిర్యాల:** వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక ప్రేరణ, అవగాహన తరగతులను ప్రారంభించింది. మంగళవారం జిల్లా కేం ద్రంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధికారులు భాగ్యవతి, దుర్గాప్రసాద్, యా దయ్య, రాజేశ్వరి తదితరులతో కలిసి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

**లక్ష్యంతో చదివితేనే విజయం..**

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఇష్టపడి చదవాలని సూచించారు. పట్టుదలతో శ్రమించి ఉన్నత స్థానాలకు చేరుకోవడం ద్వారా జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విషయ నిపుణులైన ఉపాధ్యాయులు చెప్పే మెలకువలను పాటించి, అన్ని సబ్జెక్టుల్లో వంద శాతం మార్కులు సాధించాలని పిలుపునిచ్చారు.

**రాష్ట్రంలోనే మొదటి స్థానమే లక్ష్యం...**

జిల్లాలోని పదో తరగతి విద్యార్థులందరూ ఈ అవగాహన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వార్షిక ఫలితాల్లో మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా విద్యార్థులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు సునీల్, టీఎస్జీఓ ప్రతినిధి శ్రీహరి, ఏటీడీఓ సురేష్, వసతి గృహ సంక్షేమాధికారి ధర్మానంద్ గౌడ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మకు అక్షరమాల కేంద్రాల తనిఖీ




- **వంద రోజుల్లో అక్షరాస్యత సాధించడమే లక్ష్యం**
- **వెంకటరావుపేటలో విద్యా సామర్థ్యాన్ని పరిశీలించిన అధికారులు**
- **ఇంటి ఇల్లాలి చదువు.. ఇంటికే వెలుగు: ఏపీవో పురుషోత్తం నాయక్**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** 'అమ్మకు అక్షరమాల' ఉల్లాస్ (ULLAS) కార్యక్రమంలో భాగంగా హాజీపూర్ మండలం వెంకటరావుపేటలోని అక్షర కేంద్రాన్ని మంగళవారం జిల్లా అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఆర్డీఓ కిషన్, జెడ్పీ సీఈఓ గణపతి, వయోజన విద్యాశాఖ పీవో పురుషోత్తం నాయక్, డీవీ అండ్ ఏహెచ్ఓ శంకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, ఎల్డీఎం తిరుపతి తదితరులు ఈ తనిఖీలో పాల్గొన్నారు.

**చదవడం, రాయడంలో నైపుణ్యం..**

ఈ సందర్భంగా డీఆర్డీఓ కిషన్ మాట్లాడుతూ... కేంద్రంలోని మహిళలు అక్షర వికాసం పుస్తకంలోని పాఠాలను చదవడం, రాయడం స్వయంగా పరిశీలించారు. వంద రోజుల్లో 200 గంటల పాటు శ్రమించి 16 పాఠాలను పూర్తి చేయాలని విద్యార్థులకు సూచించారు. అక్షర వికాసం పుస్తకాన్ని బొమ్మలతో సరళంగా రూపొందించామని, మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరింత మెరుగ్గా బోధించాలని వాలంటీర్లకు ఆదేశాలిచ్చారు.

**కీలకమైన జీవ నైపుణ్యాలు...**

వయోజన విద్యాశాఖ పీవో పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ, మహిళా సంఘాల సభ్యులు అక్షరాస్యతతో పాటు జీవ నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవచ్చన్నారు. ఇంటి ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు వంటిదని పేర్కొన్నారు. సర్పంచ్ నలిమెల రాజు మాట్లాడుతూ... గ్రామంలోని కేంద్రాల నిర్వహణకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. జెడ్పీ సీఈఓ గణపతి, ఇతర అధికారులు చదువు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త రామచందర్, ఏపీఎం భూమక్క, సీసీలు సురేందర్, సుమలత, ఉప సర్పంచ్ తిరుమల, వాలంటీర్లు అనిత, శారద, తిరుమల, భాగ్య, సువర్ణ, జ్యోతి, వరలక్ష్మి మరియు 55 మంది సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దేశరాజు శివ సాయి



**శెనార్తి మీడియా, గన్నేరువరం:** కరీంనగర్ జిల్లా సమాచార రక్షణ హక్కు చట్టం సాధన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గన్నేరు వరం మండల కేంద్రానికి చెందిన దేశరాజు శివ సాయిని నియమిస్తున్నట్లు ఫౌండర్ నేషనల్ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ మంగళవారం వెల్లడించారు. ఈ సందర్భంగా దేశరాజు శివ సాయి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005లో అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ చట్టం ద్వారా భారత పౌరులకు ప్రభుత్వ సమాచారాన్ని పొందే హక్కు లభిస్తుందన్నారు. ప్రభుత్వ పారదర్శకత పెంపు, జవాబుదారితనానికి బలపరిచేలా ఈ చట్టం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పౌరులు సమాచారాన్ని తెలుసుకోవడం ద్వారా ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే అవకాశం కలుగుతుందని, తమ హక్కులను కాపాడుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార హక్కు చట్టం సాధన సభ్యులు సుర స్రవంతి, మల్లం వెంకటేశం, ఎన్ శ్రీధర్ నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ దేశరాజు శివ సాయికి శుభాకాంక్షలు తెలిపారు

# మహిళల భద్రతకు 'పోష్' చట్టం కవచం

- **వేధింపులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలి**
- **ప్రతి కార్యాలయంలో అంతర్గత కమిటీల ఏర్పాటు తప్పనిసరి**
- **జిల్లాలో ఇప్పటివరకు 47 కమిటీల ఏర్పాటు: సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



ప్రభుత్వ, ప్రైవేటు పని ప్రదేశాలలో మహిళలను లైంగికంగా వేధించే వారిపై పోష్ యాక్ట్-2013 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ హెచ్చరించారు. పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత, గౌరవం కల్పించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యమని ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయాలు, పరిశ్రమలు, షాపింగ్ మాల్స్, జిన్నింగ్ మిల్లుల్లో పనిచేసే మహిళలు వేధింపులకు గురైతే నిర్భయంగా అంతర్గత ఫిర్యాదు కమిటీలను ఆశ్రయించాలని సూచించారు.

**- సమిష్టి కృషితోనే నివారణ...**

మహిళా సాధికారత కేంద్రం ద్వారా ఈ చట్టంపై విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు రౌఫ్ ఖాన్ వివరించారు. ఫిర్యాదు అందిన వెంటనే కమిటీలు విచారణ పూర్తి చేస్తాయని, అవసరమైతే పోలీసు కేసులు కూడా నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి సంస్థ తన పరిధిలో అంతర్గత కమిటీలను ఏర్పాటు చేసి, ఆ వివరాలను 'షీ బాక్స్' పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

**జిల్లాలో కమిటీల వివరాలు...**

జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఇప్పటివరకు 47 అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటయ్యాయని ఆయన వెల్లడించారు. ఇందులో జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లో 30, ఉప జిల్లా స్థాయిలో 16, ప్రైవేట్ రంగంలో ఒకటి ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ సంస్థలు తక్షణమే కమిటీలను ఏర్పాటు చేసి జిల్లా సంక్షేమ శాఖకు సమాచారం అందించాలన్నారు. మహిళలు తమ హక్కులను తెలుసుకొని ధైర్యంగా ముందుకు వచ్చినప్పుడే పని ప్రదేశాలు సురక్షితంగా మారుతాయని పేర్కొన్నారు.

# ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆహారం అందించాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

- **వసతి గృహాల్లో అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించిన ఐటీడీఏ అధికారి**
- **మెనూ అమలు, పారిశుద్ధ్యంపై సిబ్బందికి కీలక ఆదేశాలు**
- **ఐటీడీఏ పల్స్ యాప్ పనితీరుపై ఆరా**

గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని ఉట్నూర్ ఐటీడీఏ అధికారి యువరాజ్ మార్మాట్ ఆదేశించారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలతో పాటు లక్సెట్టిపేట, జన్నారం బాలుర ఆశ్రమ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న విద్యా, వైద్య సదుపాయాలు, భోజన నాణ్యతను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**విద్యార్థులతో ముఖాముఖి...**

నేరుగా విద్యార్థులతో మాట్లాడిన ఆయన.. వసతి గృహాల్లోని సమస్యలు, మెనూ ప్రకారం అందుతున్న భోజనం రుచిపై ఆరా తీశారు. తరగతి గదిలో విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం వంటగదిని పరిశీలించి ఆహారాన్ని రుచి చూశారు. కంప్యూటర్ ల్యాబ్‌ను తనిఖీ చేసిన ఆయన, ఐటీడీఏ పల్స్ యాప్ ద్వారా ఆరోగ్య సమాచార నమోదు తీరును హెల్త్ వర్కర్లను అడిగి తెలుసుకున్నారు. యాప్ వినియోగంలో ఏవైనా సమస్యలుంటే వెంటనే దృష్టికి తీసుకురావాలన్నారు.

**పారిశుద్ధ్యంపై అప్రమత్తత..**

దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా వసతి గృహ పరిసరాలను నిరంతరం శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. వంటగది, స్టోర్ రూమ్, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం కచ్చితంగా వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు

# ముగిసిన సీఎం కప్ కార్పొరేషన్ స్థాయి పోటీలు

- **800 మంది క్రీడాకారుల భాగస్వామ్యం**
- **జిల్లా స్థాయి పోటీలకు జట్ల ఎంపిక**

**శెనార్తి మీడియా , మంచిర్యాల:**



స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సీఎం కప్ మంచిర్యాల కార్పొరేషన్ స్థాయి క్రీడా పోటీలు ఘనంగా జరిగాయి. డీడీ సుజాత, డీవైఎస్ఓ హనుమంత్ రెడ్డి ఇతర అధికారులు కలిసి పోటీలను ప్రారంభించారు. కార్పొరేషన్ పరిధిలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 800 మంది క్రీడాకారులు ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో తలపడ్డారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు కార్పొరేషన్ జట్లను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్పిటళ్లలో సాధారణ కాన్పులు పెంచాలి



- **గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**
- **దోమల నివారణకు ప్రతి శుక్రవారం స్పెషల్ డ్రైవ్**

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్యను పెంచేలా ఆశా కార్యకర్తలు కృషి చేయాలని కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శ్రావణి సూచించారు. మంగళవారం ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా దోమల వ్యాప్తిని అరికట్టేందుకు నీటి నిల్వలు లేకుండా ప్రతి శుక్రవారం 'స్పెషల్ డ్రైవ్' నిర్వహించాలని ఆదేశించారు. జ్వరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## ఒలింపియాడ్‌లో సత్తాచాటిన 'సెయింట్ జార్జ్'

శెనార్తి మీడియా, కరీంనగర్ : ఎస్వోఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఒలంపియాడ్, ఐఈవో ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో కొత్తపల్లి పట్టణంలోని సెయింట్ జార్జ్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు సత్తా చాటి లెవల్ 2కు సెలెక్టైనట్లు స్కూల్ చైర్మన్ పి.ఫాతిమారెడ్డి తెలిపారు. సాయి శ్రీనిక్ రెడ్డి, ఆకర్ష్ రావు, సహస్ర, అర్జున్, రిత్విక్ హృదయ్, సాత్విక్, సంతోష్ మరో 20 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు.



## కేశవపట్నం జాతర ఆదాయం రూ.15.93 లక్షలు

- **పోలీసులు, అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపు**
- **వివిధ విభాగాల ద్వారా సమకూరిన నిధులు**

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శంకరపట్నం మండలం కేశవపట్నం సమ్మక్క జాతర ద్వారా రూ.15,93, 152 ఆదాయం సమకూరినట్లు కమిటీ చైర్మన్ గుర్రం స్వామి తెలిపారు. మంగళవారం మండల వెలుగు కార్యాలయంలో దేవాదాయ శాఖ అధికారులు, పోలీసులు, పంచాయతీ పాలకవర్గం సమక్షంలో హుండీలను లెక్కించారు. ఆదాయ వివరాల ప్రకారం.. హుండీ ద్వారా రూ.9,25,092, వేలం పాటల ద్వారా రూ.1,91,500, ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.3,75,250, కేశఖండన ద్వారా రూ.35,370, మొక్కుబడి టికెట్ల ద్వారా రూ.65,940 వచ్చాయి. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సురేఖ ఎంపీడీఓ కృష్ణప్రసాద్, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఈఓ మారుతిరావు, సర్పంచ్ రాజేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ ఆకు బత్తిని విజయ్ కుమార్ జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**శెనార్తిమీడియా, కరీంనగర్ :** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం బూరుగుపల్లి హైస్కూల్‌లో టాయిలెట్స్, లైబ్రరీని గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల కోరిక మేరకు పాఠశాలలో డైనింగ్ హాల్, తరగతి గదుల నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. లైబ్రరీ ఏర్పాటుకు సహకరించిన సత్తు మల్లేశంను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ దూలం కల్యాణ్, తహశీల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో దమ్మని రాము, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

## మద్దతు ధరతో పత్తి, వరి ధాన్యం కొనుగోలు

- **కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**
- **సకాలంలో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలి**
- **సమీక్షా సమావేశంలో కలెక్టర్ కుమార్ దీపక్**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లాలో వరి ధాన్యం, పత్తి పంటల కొనుగోలుకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నస్పూర్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రయ్యతో కలిసి పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం మద్దతు ధరతో పంటలను కొనుగోలు చేస్తోందని, ఈ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.

**దిగుబడికి అనుగుణంగా కేంద్రాలు**

జిల్లాలో ఈ ఏడాది సుమారు 1.23 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసే అవకాశం ఉందని, దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పంట దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు ముందస్తుగా టోకెన్లు జారీ చేసి, కొనుగోలు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

**మౌలిక సదుపాయాల కల్పన...**

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన టార్పాలిన్లు, గోనె సంచులు, తేమ, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. హమాలీల కొరత లేకుండా చూడాలని, పారదర్శకంగా కొనుగోలు పూర్తి చేసి నిర్ణీత సమయంలో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని ఆదేశించారు. జిల్లాలో రైస్ మిల్లుల సామర్థ్యాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, మేనేజర్ శ్రీకళ, మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు




## డిఫెన్స్‌లో ఉద్యోగాలు సాధించిన 'తేజస్'

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

కొత్తపల్లి పట్టణంలోని తేజస్ డిఫెన్స్ అకాడమీకి చెందిన 30 మంది విద్యా ర్థులు డిఫెన్స్ రంగంలో ఉద్యోగాలు సాధించినట్లు అకాడమీ కరస్పాండెంట్ సీహెచ్.సతీష్ రావు తెలిపారు. అకాడమీలో మంగళవారం ఆయన ప్రెస్ మీట్ నిర్వహించి మాట్లాడారు. ఇండియన్ నేవీ ఎస్ఎస్ఆర్‌లో ఎండీ.షార్క్, టి.రాజేశ్వర్, ఎ.రాహుల్, అజ్మీరా శ్రీశాంత్ నాయక్, పి.దిలీప్, వై.సింహాద్రిరెడ్డి, మచ్చ మధు, జి.వెంకటకృష్ణ, బొంతల నితిన్, టి.సుమిత్ రెడ్డి, కె.విష్ణు, జి. అశోక్, కె.కళ్యాణ్ కుమార్, ఆకుల శివసాయి, ఎం.సాయిప్రణీత్, ఎస్ఎస్సీ జీడీ సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, అస్సాం రైఫిల్స్ విభాగంలో ఎస్.నవీన్, జె.ప్రవీణ్, సీహెచ్.సంతోష్, ఎం.కిష్టారెడ్డి, సీహెచ్.శ్రవణ్ కుమార్, పి.సతీష్, జె.విష్ణు, యు.మహిపాల్, జి.చెన్నారాయుడు, వి.సాయికిరణ్, బి.ఖాసీం, జి.రాజ్ కుమార్, జి.వివేక్, బి.అరుణ్ కుమార్, జి.శివ ఉద్యోగాలు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. తమ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధిస్తునందుకుగర్వకారణంగా ఉందని, 2026--27 విద్యాసంవత్సరం నుంచి అమ్మాయిలకు డిఫెన్స్ కోచింగ్ ప్రారంభిస్తున్నామని వివరించారు. ఐఐటీ, జేఈఈ, నీట్ లో తమ కాలేజీ విద్యార్థులు ర్యాంకులు సాధించేందుకు హైదరాబాద్ శ్రీచైతన్యతో ఒప్పందం కుదుర్చుకున్నామని అన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అభినందించారు.

# దురంధర్ పాకిస్తానీలకూ నచ్చాడు



భారత్–పాకిస్థాన్ మధ్య రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో పాటు, గత ఏడాది పహల్గాం ఘటన తర్వాత పరిస్థితి మరింత కఠినమైంది. దీని ప్రభావం సినిమా రంగంపైనా పడింది. ఒకప్పుడు రెండు దేశాల మధ్య సాగిన సినీ పరస్పర సంబంధాలు ఇప్పుడు పూర్తిగా నిలిచిపోయాయి. పాకిస్థాన్ నటీనటులు భారత చిత్రాల్లో కనిపించడం లేదు, అలాగే భారత సినిమాలు అక్కడ థియేటర్లలో విడుదల కావడం కూడా ఆగిపోయింది.అయినా హిందీ సినిమాలపై ఆసక్తి తగ్గలేదు. ముఖ్యంగా పాకిస్థాన్ నేపథ్యంతో తెరకెక్కిన 'దురంధర్' విషయంలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. అక్కడ అధికారికంగా విడుదల కాకపోయినా, పైరసీ మార్గంలో ఈ సినిమాను పెద్ద సంఖ్యలో వీక్షించినట్లు సమాచారం. అంచనాల ప్రకారం పాకిస్థాన్‌లో ఈ సినిమా పైరసీ డౌన్‌లోడ్లు 20 లక్షలు దాటినట్లు ప్రచారం సాగుతోంది.ఇటీవల నెట్‌ఫ్లిక్స్‌లో డిజిటల్‌గా అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా 'దురంధర్' పాకిస్థాన్‌లో నంబర్ వన్ ట్రెండింగ్ మూవీగా కొనసాగుతోంది. ఆసక్తికరంగా, అక్కడ నెట్‌ఫ్లిక్స్ టాప్ లిస్ట్‌లో రెండో స్థానంలోనూ బాలీవుడ్ సినిమానే ఉంది. ధనుష్, కృతి సనన్ నటించిన 'తేరే ఇష్క్ మే' కూడా ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. ఈ గణాంకాలపై స్పందిస్తున్న భారత నెటిజన్లు, బాలీవుడ్ సినిమాలకున్న క్రేజ్ సరిహద్దులు దాటుతోందంటూ సోషల్ మీడియాలో చర్చిస్తున్నారు.

## రిహద్దులు దాటి ప్రతీకారం..
### 'ధురంధర్ 2' టీజర్‌తో హై వోల్టేజ్ హింట్

ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' గత ఏడాది చివర్లో ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. వాణిజ్యపరంగా రికార్డులు సృష్టించిన ఈ సినిమాకు కొనసాగింపుగా సీక్వెల్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. 'ధురంధర్: ది రివెంజ్' పేరుతో రూపొందిన రెండో భాగాన్ని మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. మొదటి భాగం కేవలం హిందీలోనే విడుదల కాగా, ఈసారి హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ ప్రేక్షకులను పలకరించనుంది. ఈ నేపథ్యంలో తాజాగా 'ధురంధర్ 2' టీజర్‌ను విడుదల చేశారు. టీజర్‌లో రణ్‌వీర్ సింగ్ చెప్పిన "ఇది కొత్త భారతదేశం.. సరిహద్దులు దాటి చొచ్చుకువచ్చి దెబ్బకొట్టి తీరుతుంది" అనే డైలాగ్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచింది. ప్రతీకారం, దేశభక్తి నేపథ్యంగా రూపొందుతున్న ఈ సీక్వెల్ మరింత ఘాటైన యాక్షన్‌తో ప్రేక్షకులను అలరించనుందనే సంకేతాన్ని టీజర్ స్పష్టంగా ఇస్తోంది.





## అలయా ఎఫ్ గ్లామర్ షో

బాలీవుడ్ యువ నటి అలయా ఎఫ్ మరోసారి తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. ఇటీవల ఆమె షేర్ చేసిన మిర్రర్ సెల్ఫీ ఫొటోషూట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మారూన్ కలర్ స్ట్రాప్‌లెస్ కార్సెట్ గౌన్‌లో అలయా స్టైలిష్ లుక్‌లో కనిపించింది. వేవీ హెయిర్, బోల్డ్ మేకప్ ఆమె లుక్‌కు మరింత ఆకర్షణ తీసుకొచ్చాయి. వాలెంటైన్స్ సందర్భంగా చేసిన ఈ ఫొటోషూట్ అభిమానుల నుంచి మంచి స్పందన పొందుతోంది.

# పీఆర్ వార్..
## రకుల్ సంచలన వ్యాఖ్యలు

బాలీవుడ్‌లో తాజాగా సాగుతున్న పీఆర్ వార్స్‌పై రకుల్ ప్రీత్ సింగ్ తీవ్రంగా స్పందించింది. ఒకరిని దెబ్బతీయడానికి డబ్బులు ఖర్చు చేసి మరీ నెగిటివ్ ప్రచారం చేయిస్తున్న సంస్కృతి ప్రమాదకరంగా మారిందని వ్యాఖ్యానించింది. అసలు గుర్తింపు కష్టంతోనే వస్తుందనీ, పీఆర్ వ్యవస్థలు కొంత వరకే ఉపయోగపడతాయని స్పష్టం చేసింది. ఇతరులపై విషం చిమ్మే ఇలాంటి చర్యలు చేసే వారు ఎప్పటికైనా మూల్యం చెల్లించుకోక తప్పదని రకుల్ హెచ్చరించింది. తాను ఎవరి సహాయం లేకుండా స్వయంకృషితో ఈ స్థాయికి చేరుకున్నానని, చీప్ పీఆర్ పద్ధతులు తనకు అవసరం లేదని తేల్చిచెప్పింది. ఇక ఫోటోగ్రాఫర్ల వ్యవహారంపైనా ఆమె అసహనం వ్యక్తం చేసింది. తాను ఏ దుస్తులు వేసుకోవాలన్నది తన వ్యక్తిగత ఇష్టమని, ప్రతి విషయాన్ని అతిగా విశ్లేషించడం సరి కాదని పేర్కొంది. రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారి తీస్తున్నాయి.




# నిజాయతీకి రజనీకాంత్ గౌరవం

చెన్నై మహానగర పాలకసంస్థలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పద్మ నిజాయతీకి అరుదైన గౌరవం దక్కింది. రోడ్డుపై దొరికిన 45 తులాల బంగారాన్ని పోలీసులకు అప్పగించి ఆమె తన నిజాయతీని చాటుకున్నారు. ఈ ఘటన అప్పట్లో విస్తృతంగా చర్చకు దారితీసింది. పద్మ చేసిన పనిని మెచ్చుకున్న సూపర్ స్టార్ రజనీకాంత్ ఆమెను తన నివాసానికి ఆహ్వానించారు. అక్కడ ఆమెతో సన్నిహితంగా మాట్లాడిన ఆయన, గుర్తుగా బంగారు గొలుసును కానుకగా అందించారు. సాధారణ కార్మికురాలి నిజాయతీని గౌరవించిన ఈ చర్యకు ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఇదే క్రమంలో పద్మకు భారత తపాలా శాఖ ప్రత్యేక గౌరవం కల్పించింది. ఆమె ఫొటోతో కూడిన ప్రత్యేక పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా రూ.15 లక్షల ప్రమాద బీమా పాలసీని అందించారు. ప్రభుత్వం తరపున రూ.లక్ష నగదు బహుమతిని చెక్కు రూపంలో ఇచ్చిన సంగతి తెలిసిందే



# ప్యారడైజ్ బడ్జెట్ మించిపోయిందా?

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్'పై అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. 'దసరా' తర్వాత ఈ కాంబో నుంచి వస్తున్న చిత్రంగా ఇప్పటికే చర్చలో ఉన్న ఈ మూవీ బడ్జెట్ విషయంలోనూ రికార్డు స్థాయికి చేరినట్లు సమాచారం. తొలుత రూ.150 కోట్లుగా భావించిన వ్యయం, మేకింగ్ స్కేల్ పెరగడంతో రూ.200 కోట్లకు పైగా వెళ్లినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్. ఇది నాని కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్ చిత్రం. షూటింగ్ దశలోనే ఈ సినిమాకు ఓటీటీ మార్కెట్‌లో మంచి డిమాండ్ కనిపిస్తోంది. నెట్‌ఫ్లిక్స్ డిజిటల్ హక్కులను సుమా రు రూ.75 కోట్లకు దక్కించుకున్నట్లు సమాచారం. 1990ల కాలం నాటి సికింద్రాబాద్ స్లమ్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో నాని మాస్ పాత్రలో కనిపించనున్నారు. మోహన్ బాబు, రాఘవ జుయల్, కయాదు లోహర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మార్చి 26న విడుదల లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ వాయిదా పడే అవకాశముందని ప్రచారం సాగుతోంది.



# పౌరాణిక యుద్ధ గాథగా 'గాడ్ ఆఫ్ వార్

'ఎన్టీఆర్‌తో త్రివిక్రమ్ సరికొత్త ప్రయోగం?టాలీవుడ్‌లో ప్రస్తుతం ఎక్కువగా చర్చకు వస్తున్న ప్రాజెక్ట్ 'గాడ్ ఆఫ్ వార్'. మొదట ఈ కథను అల్లు అర్జున్‌తో తెరకెక్కించాలన్న ఆలోచన ఉన్నప్పటికీ, మారిన పరిస్థితుల్లో దర్శకుడు త్రివిక్రమ్ ఈ కథను ఎన్టీఆర్‌కు వినిపించినట్లు సమాచారం. కథ నచ్చడంతో తారక్ నుంచి సానుకూల స్పందన వచ్చిందన్న ప్రచారం సినీ వర్గాల్లో వినిపిస్తోంది.కుమారస్వామి పౌరాణిక నేపథ్యంతో సాగే ఈ చిత్రంలో ఎన్టీఆర్ యుద్ధాధిపతి పాత్రలో, దైవ స్వరూపంలో కనిపించనున్నారని టాక్. ఇప్పటివరకు చూడని స్థాయిలో విజువల్ గ్రాండియర్‌తో సినిమా రూపొందించేందుకు ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. భారీ సెట్స్, విస్తృత సాంకేతిక హంగులతో ఈ మూవీ టాలీవుడ్‌లో ప్రత్యేకంగా నిలవనుందన్న అంచనాలు పెరుగుతున్నాయి.ఎన్టీఆర్–త్రివిక్రమ్ కలయికపై కొంతకాలంగా వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. ఈ కాంబోకు సరిపోయేలా స్క్రిప్ట్‌లో మార్పులు చేసినట్లు, 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్‌ను కూడా పరిశీలిస్తున్నారని టాక్. ప్రీ ప్రొడక్షన్ పనులు మొదలైనాయన్న సమాచారం నేపథ్యంలో, అధికారిక ప్రకటన ఎప్పుడొస్తుందన్న ఉత్కంఠ నెలకొంది. మరోవైపు త్రివిక్రమ్–అల్లు అర్జున్ కలయిక మళ్లీ సాధ్యమవుతుందా అన్న అంశం కూడా సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది



Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644